క్లుప్తంగా

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



లోవకొత్తూరులో మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న పాస్టర్ రాజబాబు, శ్రీనివాసరావు

తుని రూరల్: దాతలు సమకూర్చిన కుట్టు మెషీన్లను సద్వినియోగం చేసుకుని కుటుంబాలకు ఆసరాగా నిలవాలని తాళ్లూరు గ్రామానికి చెందిన తమరాన శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని లోవ కొత్తూరులో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు, ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. పాస్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో ఎఫ్‌పీటీసీ సంస్థ అధినేత పాస్టర్ డాక్టర్ ఐజాక్ బెనర్జీ సౌజన్యంలో ఆరు నెలలు పాటు మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మెషీన్లు అందజేశారు. ఎఫ్‌పీటీసీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



రాజుపాలెంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

కిర్లంపూడి: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రాజుపాలెం గ్రామ శివారున ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్ బి.సతీష్‌బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. రూ.50 మించి నగదు తీసుకువెళితే తగిన ఆధారాలు చూపించాలన్నారు. అక్రమ మద్యం, ఇతర సామగ్రి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీసీలు సత్యనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా వాహనాల రాకపోకలు



ఎ.కొత్తపల్లి-కొమ్మనాపల్లి రహదారిలో పూర్తయిన కల్వర్టు నిర్మాణ పనులు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి సాలిపేట రామాలయం వద్ద సీతారాంపురం, కొమ్మనాపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణం పూర్తికావడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా జరుగుతున్నాయి. తొండంగి ప్రధాన రహదారి నుంచి ఎ.కొత్తపల్లి, సీతారాంపురం, కొమ్మనాపల్లి గ్రామాలకు నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతాయి ఎ.కొత్తపల్లి సాలిపేట రామాలయం సెంటర్ వద్ద కల్వర్టు శిథిలమవ్వడంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. శిథిలమైన కల్వర్టును తొలగించి నూతన కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో దాదాపు నెల రోజుల పాటు ఈ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కల్వర్టు నిర్మాణం పూర్తికావడంతో రాకపోకలు యథావిధిగా జరుగుతున్నాయి.

వైభవంగా వేంకటేశ్వరస్వామి పల్లకీ సేవ



ప్రత్తిపాడులో వేంకటేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడులో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి పల్లకీ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. పండితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో స్వామివారిని ఊరేగించారు. దారి పొడవునా భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 3న స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రామలింగేశ్వరస్వామికి పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ పండితులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చంద్రబాబును తరిమికొట్టండి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కేఓ అగ్రహారంలో ఎన్నికల ప్రచారం



కేఓ అగ్రహారంలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా



పార్టీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారకముందే ఇంటికి పింఛను తెచ్చి ఇచ్చే వలంటీర్లను కుయుక్తులు పన్ని చంద్రబాబు అడ్డుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు అనే చంద్రముఖిని తరిమికొట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. మండలంలోని కేఓ అగ్రహారంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, సీఎం జగన్ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పథకాలన్నీ యథావిధిగా కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు విషం కక్కుతున్నారన్నారు. వారిని తొలగించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని మండి పడ్డారు. పింఛనుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ పింఛను అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, ఏపీబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, లోవ దేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, సర్పంచ్ సారిక దేవుడు, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కోటనందూరు: వైఎస్సార్ సీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. మండలంలోని కేఓ అగ్రహారం గ్రామానికి చెందిన 30 మంది టీడీపీ కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ముగిశాయి. ఆలయ కమిటీ పర్యవేక్షణలో వేద పండితుడు అగ్నిహోత్రం రంగాచార్యులు ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించారు. అర్చకులు శంకరణం వెంకటరాజు, రాజ్యలక్ష్మి దంపతులు వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల పంచలోహ విగ్రహాలను సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ మడదా చంద్రశేఖర్, సత్యకుమారి దంపతులు సుదర్శన మూర్తి పంచలోహ విగ్రహాన్ని సమర్పించారు. ఐదు రోజుల పాటు జరిగిన వార్షికోత్సవాల్లో పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, స్వామివారికి పంచామృతాభిషేకాలు, కల్యాణోత్సవం, అన్న సమారాధన, ఊరేగింపు, కోలాటం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు
- ధర్మవరంలో ఎమ్మెల్సీ అనంతబాబుతో కలిసి ఎన్నికల ప్రకారం



ధర్మవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతబాబు

ప్రత్తిపాడు రూరల్: నిరంతరం ప్రజల కోసం పాటుపడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఆ పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మవరంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌తో కలిసి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 400 గ్రామాలను దత్తత తీసుకుని ఒక్కో గ్రామానికి రూ.కోటి చొప్పున సొంత నిధులు వెచ్చించి వచ్చే ఐదేళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. భారీగా పరిశ్రమలను తీసుకువచ్చి కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అర్హతే ప్రమాణికంగా అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, ఎంపీపీ గొళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, గ్రామ సర్పంచ్ బెందుకుర్తి సుశీల అబ్బాయి, వైస్ సర్పంచ్ బొల్లు సీతారామరాజు, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బుల్లి రామకృష్ణ, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ షేరు కృష్ణ, గ్రామ సర్పంచులు ఏపూరి రామారావు, గొనగాల అప్పలరాజు, బొండి రాంబాబు, బీశెట్టి అప్పలరాజు, రాపర్తి రామకృష్ణ, ఎంపీటీసీలు సీం ద్రపు భాస్కరరావు, అమరాధి కాశి, ఉమ్మిడి తాతీలు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల నిలిపివేత పాపం టీడీపీదే



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: ప్రతినెలా ఒకటో తారీఖున తెల్లవారక ముందే ఇంటికి వచ్చే పింఛన్లను నిలిపివేసిన పాపం టీడీపీకే చుట్టుకుంటుందని మండల వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక విశాల సహకార పరపతి సంఘం కార్యాలయంలో సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందు చూపుతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి వలంటీర్ల ద్వారా ప్రతీ నెలా ఒకటో తేదీన ఇంటింటికే పింఛన్లు పంపిణీ చేశారన్నారు. వలంటీర్ల ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించారన్నారు. వలంటీర్ల ద్వారా అందుతున్న సంక్షేమాన్ని అడ్డుకునేందుకు టీడీపీ కుట్రలు చేసిందన్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు పింఛన్ల కోసం పడిగాపులు కాసే పరిస్థితి వచ్చిందన్నారు. పింఛన్ల పంపిణీ విషయంలో ప్రభుత్వంపై బురద చల్లేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారం చేపట్టిన తరువాత వలంటీర్ల ద్వారా అన్ని సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటికే అందుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, నాయకులు సుంకర వీరబాబు, సమ్మెటి నాని, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, బత్తుల నానాసీ, సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ ఇజ్జిన కిరణ్, సభ్యులు అంబటి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



వీరవరంలో తోట నరసింహాన్ని కలసిన జగన్నాథపురం వైఎస్సార్ సీపీ నాయకులు



పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో తోట నరసింహం

వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సూచించారు. గోకవరం మండలం కామరాజుపేట పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కిర్లంపూడి మండలం వీరవరంలో తోట నరసింహం, తోట రాంజీలను మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో గెలుపుపై తోట నరసింహం, రాంజీ వారితో చర్చించారు. అలాగే గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు వానపల్లి సోమరాజు, ఇజ్జపురెడ్డి నాగసూర్యప్రకాష్ తదితరులు సోమవారం వీరవరంలో తోట నరసింహం సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి తోట నరసింహం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

రేపటి నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: పింఛను లబ్ధిదారులకు ఈ నెల 3 నుంచి ఆయా గ్రామ సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్ల నుంచి మొబైల్ ఫోన్లు, బయోమెట్రిక్ స్కానర్లను పంచాయతీ కార్యదర్శులు స్వాధీనం చేసుకుని ఎంపీడీఓ కార్యాలయానికి అందజేయాలన్నారు. అలాగే ప్రతి పంచాయతీ గ్రామ కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కుళాయిల ద్వారా ప్రజలకు అందించే మంచి నీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి కె.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా సోమవారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు సంతోష్ ఘనాపాఠి, గంగాధరబట్ల శర్మ, కంచిభట్ల సాయిరామ్, వ్రత పురోహితులు చెళ్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

- ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- కొత్తయర్రవరంలో ఎన్నికల ప్రచారం



కొత్తయర్రవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని కొత్త యర్రవరంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా విజయం సాధించలేరన్నారు. సీఎం జగన్‌కు మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు పాలనలో అన్నివర్గాలకూ అన్యాయం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. అవినీతి రహిత పాలన కావాలంటే సీఎం జగన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు బొద్దు లక్ష్మణ స్వామి, పార్టీ నేతలు అడపా పార్థసారథి, బుద్దా నానాజీ, బుద్దా గణేష్, రామిశెట్టి వెంకటరమణ, మజ్జూరి రాజులు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి సోకితే ప్లేట్‌లెట్స్ తగ్గి పోతాయన్నారు. ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట మాత్రమే కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

తుని: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో తమ విద్యార్థులు ప్రతిభ చూసినట్టు శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ సోమవారం తెలిపారు. శ్రీప్రకాష్‌లో 5వ తరగతి చదువుతున్న అన్నంరెడ్డి జయంత్, కాకర పూజిత, కొనా భారతి నవోదయలో ప్రతిభ కనబరిచి 6వ తరగతి ప్రవేశాలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

గోకవరం: మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారు. మండలంలోని వీరలంకపల్లి ఎంపీపీ పాఠశాలకు చెందిన పి.రాజారామ్, కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తూరు ఎంపీపీ పాఠశాలకు చెందిన కె.కరుణశ్రీ నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. వీరిని ఎంఈఓలు బి.గౌరమ్మ, చిమ్మ రాజుదొర, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అభినందించారు. అలాగే కొత్తపల్లికి చెందిన ఆదర్శ హైస్కూల్ విద్యార్థి కనుబోయిన సతీష్‌చంద్ర నవోదయకు ఎంపికయ్యాడు. సతీష్‌చంద్రను కళాశాల చైర్మన్ పి.కనకరాజు, హెచ్‌ఎం జె.సత్యనారాయణ, కో ఆర్డినేటర్ శ్రీనివాస్ అభినందించారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా



గుమ్మరేగులలో మూకుమ్మడిగా రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు

రౌతులపూడి: నాలుగున్నరేళ్ల పాటు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లతో పాటు ప్రజలకు నిస్వార్థ సేవలందించిన తమపై కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని నిరశిస్తూ సోమవారం గుమ్మరేగుల గ్రామ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. కరోనావంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలందించిన తమను ఎన్నికల వేళ విధులకు దూరం పెట్టడం ఎంతవరకూ సమంజసం అని ప్రశ్నించారు. ప్రతినెల మాదిరిగానే సోమవారం తెల్లవారుజాము నుంచి తాము పింఛన్లు పంపిణీ చేస్తామని కొండంత ఆశతో ఎదురు చూసిన అభాగ్యులకు ఏం సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితుల్లో మనస్థాపానికి గురై రాజీనామా చేసినట్టు విలేకర్లకు తెలిపారు. వలంటీర్లు బచ్చల శ్యామల, సేనాపతి రాజేశ్వరి, దోమాడ తమ్మయ్య, పసగడుగుల నాగలక్ష్మి, సామన హరీష్, ఆర్.ఉమ తదితరులు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు.

బడిబయటి బాలికలను కేజీబీవీల్లో చేర్పించాలి



వాకదారిపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బాలికల సంరక్షణాధికారి ఉమామహేశ్వరి

తొండంగి: గ్రామాల్లో చదువు మానేసిన బాలికలను కేజీబీవీల్లో చేర్పించాలని సమగ్ర శిక్షా అభియాన్ బాలికల సంరక్షణాధికారి పి.ఉమామహేశ్వరి సూచించారు. మండలంలోని వాకదారిపేట పరిసర గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. బడిబయట పిల్లలను గుర్తించి కేజీబీవీల్లో చేర్పించారు. కేజీబీవీలో బాలికలకు అందించే సౌకర్యాలు, రక్షణ, విద్య, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటి అంశాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. పేదలు, తల్లిదండ్రులు లేని బాలికలకు కేజీబీవీల ద్వారా ఉజ్వల భవిష్యత్తు పొందే అవకాశం ఉందన్నారు. కేజీబీవీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

సామర్లకోట: స్థానిక ఇండస్ట్రియల్ ఏరియా విమల్ బాట్లింగ్ కంపెనీ ఎదురుగా సోమవారం ఆటో బోల్తా పడడంతో నలుగురు విద్యార్థినులు గాయపడిన సంఘటన ఇది. స్థానిక బ్రౌన్‌పేటలో ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థినులు పెద్దాపురం, మండల పరిధిలోని గ్రామాలలోని వారి స్వగృహాలకు వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఆటో సీబీఎం సెంటర్ నుంచి విమల్ బాట్లింగ్ కంపెనీ వద్ద ముందు వెళుతున్న మోటారు సైకిల్‌ను తప్పించే క్రమంలో బోల్తా పడింది. దాంతో ఆటోలో ఉన్న నలుగురి విద్యార్థినులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థులు పెద్దాపురం, ఆర్‌బీ పట్నం, ఆర్‌బీ కొత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. ప్రమాద సంఘటన విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని తమ కార్యకర్తలకు సూచించారు. దాంతో పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్ హుటాహుటిన ఆస్పత్రికి చేరుకొని విద్యార్థుల వివరాలు సేకరించారు. విషయం తెలిసి ఎస్సై మౌనిక ఆస్పత్రికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ఏడీబీ రోడ్డు లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.